సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 30 । నవంబర్ । 2024



చీనీ టన్ను రూ.27,280

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27,280, కనిష్టంగా రూ.12,300 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.33

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.33, కనిష్టంగా రూ.20, సరాసరిన రూ.26 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.1°/14.2°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. మడకశిర, హిందూపురం తదితర నియోజకవర్గాల్లో చలి ఎక్కువగా ఉంది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

పింఛన్లకు రూ.114.29 కోట్లు

- నేటి నుంచి పంపిణీ చేయనున్న యంత్రాంగం

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత కింద ఎన్టీఆర్ భరోసా పేరుతో అందించే పింఛన్ల కోసం ప్రభుత్వం డిసెంబర్ నెలకు సంబంధించి రూ.114.29 కోట్లు మంజూరు చేసింది. 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగా శనివారమే లబ్ధిదారులకు పింఛన్లు అందించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2,65,277 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, వీరికి పింఛన్ అందించేందుకు 9,551 మంది ఉద్యోగులను నియమించినట్లు వెల్లడించారు. వారంతా శనివారం నుంచి ఇంటింటికీ వెళ్లి పింఛన్ మొత్తం అందజేస్తారన్నారు. శనివారం పింఛన్ అందుకోలేని వారికి సోమవారం పింఛన్ మొత్తం అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ కారణాలతో కొందరు పింఛన్‌దారులు సకాలంలో పింఛన్ మొత్తం అందుకోలేకపోతున్నారని, ఈ సమస్యను గుర్తించి తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ నెల నుంచి వరుసగా మూడు నెలల పాటు పింఛన్ మొత్తం తీసుకోలేకపోయినా... మూడు నెలల మొత్తం కలిపి నాలుగో నెలలో అందిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

క్వింటా ఎండుమిర్చి రూ.18,500



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధరలు నిలకడగా ఉన్నాయి. శుక్రవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా ఎండుమిర్చి గరిష్టంగా రూ.18,500 మేర పలికింది. మార్కెట్‌కు 135 క్వింటాళ్ల ఎండుమిర్చి రాగా ఈ–నామ్ పద్ధతిలో క్రయవిక్రయాలు చేపట్టినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మొదటి రకం క్వింటా రూ.18,500, రెండో రకం క్వింటా రూ.10 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7,500 ప్రకారం ధర పలికినట్లు ఆయన వెల్లడించారు. తేమశాతం తక్కువగా ఉండే నాణ్యమైన ఎండుమిర్చిని మార్కెట్‌కు తీసుకువస్తే ఆశించిన ధర దక్కుంతుందని, ఈ మేరకు రైతులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు నేమకల్లుకు సీఎం రాక



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే కాలవ

అనంతపురం అర్బన్/ బొమ్మనహాళ్: సీఎం చంద్రబాబునాయుడు శనివారం జిల్లాకు విచ్చేయనున్నారు. మధ్యాహ్నం 12.45 గంటలకు బొమ్మనహాళ్ మండలం నేమకల్లు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 1.20 గంటల వరకు విశ్రాంతి తీసుకుంటారు. అక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.25 గంటలకు ఇందిరమ్మ కాలనీకి చేరుకుంటారు. 1.55 గంటల వరకు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తారు. 2 గంటలకు గుడికి వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. 2.05 నుంచి 3.05 గంటల వరకు లబ్ధిదారులతో ముచ్చటిస్తారు. 3.15 నుంచి 3.45 గంటల వరకు హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి బయలదేరి వెళతారు.


పకడ్బందీగా ఏర్పాట్లు

నేమకల్లులో సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అధికారులతో పర్యటించారు. హెలిప్యాడ్ స్థలాన్ని, సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ లబ్ధిదారుల గృహాలను, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాన్ని, గ్రామసభ నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. మంత్రి కేశవ్ మీడియాతో మాట్లాడుతూ నేమకల్లులో నిర్వహించనున్న గ్రామసభ ద్వారా ఈ ప్రాంత సమస్యలు, ప్రజల మనోభావాలను ముఖ్యమంత్రి తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్, తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ దాస్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

ఫ్యాన్సీ నంబర్ గురూ!

- పుట్టపర్తికి చెందిన విజయ్ ఈ ఏడాది బీటెక్‌లో జాయిన్ అయ్యాడు. తోటివారంతా ఫ్యాన్సీ మొబైల్ నంబర్లు వాడుతుంటే..తానూ ఓ నంబర్ తీసుకోవాలనుకున్నాడు. చివరి ఆరు అంకెలు 991999 ఉండేలా ఓ నంబర్ సెలక్ట్ చేసుకున్నాడు. ఇందుకోసం రూ.7,500 ఖర్చు చేశాడు.
- ధర్మవరానికి చెందిన ప్రవీణ్ డిగ్రీ స్టూడెంట్. తన మొబైల్ నంబర్ చివర్లో 143143 వచ్చేలా ఓ నంబర్ తీసుకున్నాడు. ఇందుకోసం ఏకంగా రూ.23 వేలు చెల్లించాడు.
- పెనుకొండకు చెందిన శివకుమార్ వ్యాపారి. జాతకాలు, సంఖ్యాశాస్త్రంపై ఆయనకు నమ్మకం ఎక్కువ. ఓ స్వామిజీని సంప్రదించి తనకు కలిసి వచ్చేలా చివరి ఐదు అంకెలు 8 ఉండేలా ఓ నంబర్ తీసుకున్నాడు. స్థానికంగా ఆ నంబర్ అందుబాటులో లేకపోవడంతో గుజరాత్ నుంచి తెప్పించాడు. ఇందుకోసం రూ.30 వేల దాకా ఖర్చు చేశాడు.
- హిందూపురానికి చెందిన సతీష్ మొబైల్ నంబర్ చివర 2888 ఉంది. తన స్నేహితురాలి కోసం 2889 ఉండేలా ఓ నంబర్ తీసుకున్నాడు. ఇందుకోసం రూ.5 వేల దాకా వెచ్చించాడు.

..ఇలా ఇటీవల జనం తమకు నచ్చిన మొబైల్ నంబర్ల కోసం తెగ ఆరాటపడుతున్నారు. దీంతో సర్వీస్ ప్రొవైడర్లు, సిమ్స్ విక్రయించే దుకాణదారులు డిమాండ్ మేరకు రేటు ఫిక్స్ చేస్తున్నారు. ఫలితంగా ఫ్యాన్సీ నంబర్ కావాలంటే భారీగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది.



- ఒక్కసారి డయల్ చేస్తే గుర్తుండిపోవాల
- ఫ్యాన్సీ మొబైల్ నంబర్ల కోసం ఎగబడుతున్న జనం
- క్యాష్ చేసుకుంటోన్న వ్యాపారులు
- 9 సిరీస్‌కు యూత్‌లో ఫుల్ డిమాండ్
- ఇతర రాష్ట్రాల నుంచి నంబర్లు కొంటున్న వైనం
- మూడు నెలలు ముందుగానే ఫ్యాన్సీ నంబర్ల బుకింగ్

సాక్షి, పుట్టపర్తి

గతంలో వాహనాల రిజిస్ట్రేషన్ నంబర్ చివర్లో 9 కోసం జనం ఆరాటపడే వారు. ఇందు కోసం రూ.లక్షలు చెల్లించిన వారూ ఉన్నారు. ఆ ట్రెండ్ తాజాగా మొబైల్ నంబర్‌కూ పాకింది. ప్రత్యేకంగా ఉండాలని కొందరు... జాతకం మేరకు నంబర్ ఉండాలని ఇంకొందరు... తమ స్నేహితుల నంబర్‌ను పోలి ఉండేలా నంబర్ ఉండాలని ఇంకొందరు ఆశ పడుతున్నారు. ఇందుకోసం ఎంతైనా సరే చెల్లించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో రూ.లక్షలు వెచ్చించి నంబర్లు కొనుగోలు చేస్తున్నారు. వినియోగించే స్మార్ట్ ఫోన్ల కంటే ఫ్యాన్సీ నంబర్లకే ఎక్కువ ధర వెచ్చిస్తున్న వారూ ఉన్నారు. ప్రజల ఆసక్తిని వ్యాపారులు 'క్యాష్' చేసుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో తక్కువ ధరలకు కొనుగోలు చేసి.. అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారు. అక్కడక్కడా అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నప్పటికీ.. చాలామంది వాట్సాప్ గ్రూపుల ద్వారా ఫ్యాన్సీ నంబర్లను కొనుగోలు చేయడం మాత్రం మానడం లేదు.

ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు..

తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాన్సీ నంబర్లకు డిమాండ్ పెరగడంతో ఇతర రాష్ట్రాల నుంచి నంబర్ సిరీస్‌లను తెప్పిస్తున్నారు. అక్కడ నెట్‌వర్క్ నుంచి పోర్ట్ చేసుకుని.. ఆయా కోడ్‌ల ద్వారా స్థానికంగా అవే నంబర్లను ఇస్తున్నారు. నంబరులో ఉన్న ఫ్యాన్సీ ఆధారంగా రేటు నిర్ణయిస్తున్నారు. రూ.3 వేల నుంచి రూ.30 వేల వరకు తీసుకుంటున్నారు. కొన్ని నంబర్లకైతే రూ.3.20 లక్షల వరకు సేల్ అవుతుండటం విశేషం.

మూడు నెలలు ముందుగానే..

పక్క రాష్ట్రాల్లో కొత్తగా కొనుగోలు చేసిన నంబర్లను ఇక్కడ ఆఫర్ చేస్తారు. మూడు నెలలు ముందుగానే అడ్వాన్స్ తీసుకుంటారు. ఆ తర్వాత పోర్ట్ కోడ్ ఆధారంగా అక్కడి నంబరు ఇక్కడ ఇస్తున్నారు. ఇలాంటి సంప్రదాయం జిల్లా వ్యాప్తంగా ఉంది. కళాశాల విద్యార్థి మొదలు ఉద్యోగులు, ఉన్నతాధికారులు సైతం ఫ్యాన్సీ నంబర్ వాడటం మొదలుపెట్టాడు.

RTP NOW UPC AVIL NOW
READY TO PORT

|| 8888 30 4444 || @125k
|| 8888 58 2222 ||

|| 8888 63 6666 || @143k

|| 7777 83 9999 || @135,000
|| 8888 76 0000 ||

|| 9999 52 4444 || @130k

|| 8888 37 0000 || @150k

|| 9999 60 8888 || @180k

|| 8888 44 0000 || @220k

|| 9999 4444 66 || @320k
|| 9999 4444 88 ||

ఫ్యాన్సీ నంబర్లు, వాటి ధరలు తెలుపుతూ పుట్టపర్తికి చెందిన ఓ మొబైల్ షాపు యజమాని వాట్సాప్ గ్రూపులో పంపిన వివరాలు

ఇదో రకమైన వ్యాపారం



- మొబైల్ నంబర్ చివర్లో 999 కావాలంటే కనీసంగా రూ.3 వేలు వెచ్చించాలి. ఆరంభంలో 99 ఉంటే ధర రెట్టింపు అవుతుంది. మొత్తం నంబరులో ఆరుసార్లు 9 ఉంటే డిమాండ్ మేరకు రూ.10 వేల వరకు చెల్లించాల్సిన పరిస్థితి. ఈ ధరలన్నీ పుట్టపర్తిలో ఓ మొబైల్ షాపు నిర్వాహకుడు వాట్సాప్ గ్రూపు ద్వారా నిర్వహిస్తున్నాడు.
- బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి రెండు వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి పలు రాష్ట్రాలకు చెందిన ఫ్యాన్సీ మొబైల్ నంబర్ల అప్‌డేట్స్ ఇస్తున్నాడు. తెలిసిన వ్యక్తుల ద్వారా పబ్లిసిటీ చేస్తున్నాడు. ఫ్యాన్సీ నంబర్లపై ఆసక్తి ఉన్న వారు కాంటాక్టు చేస్తే.. మూడు నెలలు ముందుగా అడ్వాన్స్ తీసుకుని సేల్ చేస్తుంటాడు.
- ఫ్యాన్సీ నంబర్ల డిమాండ్‌కు అనుగుణంగా చాలామంది సామాజిక మాధ్యమాల వేదికగా వ్యాపారం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన నంబర్లను పోర్టబుల్ చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేకపోవడం.. ఇక్కడి వాళ్లు ఆసక్తి చూపుతుండటంతో ప్రతి ఒక్కరూ నంబర్లు అమ్మడం మొదలుపెట్టారు.

9 సిరీస్‌కే ఎక్కువ ధర..

మొబైల్ నంబరు 10 అంకెలున్నా.. అందులో ఎన్నిసార్లు 9 వచ్చిందనేది ఇంపార్టెంట్. మరోవైపు మొత్తం కూడితే 9 వస్తుండటం ధరలు పెంచేందుకు పనికి వస్తోంది. ఆరంభంలో 9.. చివరిలో 9.. మొత్తం కూడితే 9.. వచ్చే నంబర్లకు అధిక డిమాండ్ ఉంది. ఫ్యాన్సీ నంబర్లలో 9 సిరీస్ ఆధారంగా ధరలు నిర్ణయిస్తున్నారు.

ప్యాకేజీల ప్రత్యేకం..

ఫ్యామిలీ ప్యాక్‌నంబర్లు, జోడి నంబర్లు, ప్రైవేటు సంస్థలకు ఉపయోగపడే విధంగా ఒక్క నంబర్ తేడాతో.. మూడు నాలుగు సిరీస్‌లు అందుబాటులోకి తెస్తున్నారు. ప్యాకేజీలు కొంటే ధరల్లో మినహాయింపు ఉంటుందని వినియోగదారులు చెబుతున్నారు.

హామీల అమలులో సర్కార్ విఫలం

- ఇసుక, మద్యం వ్యాపారాల్లో టీడీపీ నేతలు
- మంత్రి సవిత వ్యాఖ్యలు బాధాకరం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. శుక్రవారం ఆమె సోమందేపల్లిలోని గీతానగర్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరి ఆరు నెలలు దాటుతున్నా 'సూపర్ సిక్స్' పథకాలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఓ మహిళ హోంమంత్రిగా ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు పెచ్చుమీరాయన్నారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు. ఊరూరా మద్యం ఏరులై పారుతోందని, ఫలితంగా ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో లబ్ధిపొందిన వారిని తాగుబోతులుగా, గంజాయికి అలవాటుపడ్డవారిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత శాసన మండలిలో వ్యాఖ్యానించడం దారుణమన్నారు. బాధ్యతగల పదవుల్లో ఉన్న వారే ఇలా మాట్లాడటం చూసి జనం ఛీదరించుకుంటున్నారన్నారు. పెనుకొండ ప్రాంత అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బోధనాస్పత్రి మంజూరు చేస్తే.... ప్రస్తుత కూటమి ప్రభుత్వం దాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందని, అయినా ఈ ప్రాంతం నుంచి కేబినెట్‌లో ప్రాతినిథ్యం వహిస్తున్న మంత్రి సవిత కనీసం ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. దీన్నిబట్టి చూస్తే ఆమెకు ఈ ప్రాంతం అభివృద్ధిపై ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. 'నేతన్న నేస్తం' అమలు చేయాలని చేనేతలు కోరితే..'ఎందుకు ఆ డబ్బులతో మద్యం తాగడానికా' అని వ్యాఖ్యానించడం దుర్మార్గమన్నారు. సవిత భర్త వెంకటేశ్వరరావు ఏకంగా మద్యం షాపులు ప్రారంభించి నియోజకవర్గాన్ని మద్యంలో ముంచెత్తుతున్నారని మండిపడ్డారు. పాలన చేతగాని చంద్రబాబు ప్రభుత్వం అన్ని వర్గాలనూ ఇబ్బందులకు గురి చేస్తోందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రభుత్వ తప్పిదాలను ప్రశ్నించి అక్రమ కేసుల్లో ఇరుక్కున్న పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు గజేంద్ర, శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, వైస్ ఎంపీపీ వెంకట నారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మంజునాథ్, సర్పంచ్‌లు జిలాన్, కిష్టప్ప, పార్టీ సీనియర్ నాయకులు రమాకాంత్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేసీబీ ఆపరేటర్ దుర్మరణం

రొళ్ల: మట్టి లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. వివరాలు... మడకశిర మండలం బుడ్డయ్యనపాళ్యం గ్రామానికి చెందిన ఆదికేశవ (22) నాలుగేళ్లుగా రొళ్ల మండలం మల్లసముద్రం నివాసి వద్ద జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రైతుల పొలాలకు మట్టిని తరలించే పనిలో నిమగ్నమయ్యాడు. ఒక్కడే జేసీబీతో మట్టిని పెకలించి ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని రైతుల పొలాల్లో అన్‌లోడు చేసి రాసాగాడు. మధ్యాహ్నం ట్రాలీలో మట్టిని లోడు చేసుకుని ట్రాక్టర్‌ను ముందుకు కదిలించే ప్రయత్నం చేశాడు. అయితే ట్రాక్టర్ ముందుకు కదలక పోవడంతో గట్టిగా ప్రయత్నం చేయడంతో ఒక్కసారిగా ఇంజన్ పైకి లేచి ట్రాలీకి ఆనుకుంది. డ్రైవింగ్ సీటులో ఉన్న ఆదికేశవ ఛాతీని స్టీరింగ్ బలంగా నొక్కేయడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందాడు.



ట్రాక్టర్ మధ్యలో ఇరుక్కున్న ఆదికేశవ మృతదేహం

కాసేపటి తర్వాత అటుగా వెళ్లిన రైతులు ప్రమాదాన్ని గుర్తించి ట్రాక్టర్‌కు ట్రాలీకి మధ్యన ఇరుక్కున్న ఆదికేశవ మృతదేహాన్ని అతి కష్టంపై వెలికి తీశారు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు సంఘటన స్థలానికి చేరుకుని బోరున విలపించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆధార్ సేవలకు అధికంగా వసూలు చేస్తే చర్యలు

ప్రశాంతి నిలయం: ఆధార్‌కార్డులో మార్పులు, చేర్పులకు ఎక్కడైనా నిర్ణయించిన మొత్తం కన్నా అధికంగా వసూలు చేస్తే చర్యలు తప్పవని ఆధార్ కేంద్రాల నోడల్ అధికారి సుధాకర్ రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ/వార్డు సచివాలయాలు, మీ–సేవ, పోస్టాఫీసు, బ్యాంక్‌లలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల వద్ద వివిధ సేవలకు చెల్లించాల్సిన మొత్తాన్ని పట్టిక రూపంలో పొందుపరిచామన్నారు. అందుకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించబోమన్నారు. ఆధార్ సేవల కోసం ఎక్కడైనా అధికంగా వసూలు చేస్తున్నట్లయితే ప్రజలు కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూంలో ఏర్పాటు చేసిన 7981528287 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యువతకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి

- ధర్మవరం స్కిల్‌హబ్ అధికారులకు కలెక్టర్ చేతన్ ఆదేశం



స్కిల్‌హబ్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం అర్బన్: స్కిల్ హబ్ ద్వారా యువతకు మెరుగైన శిక్షణ ఇచ్చి వారు ఉద్యోగాలు దక్కించుకునేలా చూడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శుక్రవారం ఆయన, ధర్మవరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించారు. స్కిల్ ద్వారా ఇస్తున్న శిక్షణ, మౌలిక సదుపాయాలు, శిక్షణ పూర్తి చేసిన వారికి కల్పించిన ఉపాధి అవకాశాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. అనంతరం శిక్షణకు హాజరైన వారి హాజరు పట్టికను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్... కొత్తపేటలోని విభిన్న ప్రతిభావంతుల పాఠశాలను తనిఖీ చేశారు. విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న సేవలు, కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. కలెక్టర్ వెంట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్‌బాబు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, ఏడీఎస్ డీఈ చైతన్య, ఆర్డీఓ మహేష్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈవీఎం యంత్రాలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన గోడౌన్‌ను శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించడంతో పాటు ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎం గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను తనిఖీలు చేశారు.

బాలుడి హత్య కేసును ఛేదిస్తాం

- సరిహద్దు పోలీస్‌స్టేషన్లలో సిబ్బందిని పెంచుతాం
- డ్రోన్ కెమెరాలతో నేరస్తులను గుర్తించడానికి చర్యలు
- విలేకరుల సమావేశంలో ఎస్పీ రత్న



మడకశిరలో మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ

మడకశిర: ఎనిమిదో తరగతి బాలుడు చేతన్ హత్య కేసును వీలైనంత త్వరగా ఛేదిస్తామని ఎస్పీ రత్న తెలిపారు. శుక్రవారం ఆమె మడకశిర సమీపంలోని కర్ణాటక సరిహద్దులో బాలుడి హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మడకశిరలో మీడియాతో మాట్లాడారు. చిన్నారి చేతన్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటన తనను తీవ్రంగా బాధించిందన్నారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్నామని, హంతకులు ఎవరైనా సరే చట్టం ముందు నిలబెట్టి తీరుతామన్నారు.

సిబ్బంది కొరత తీరుస్తాం..

జిల్లా పరిధిలోని 17 పోలీస్‌స్టేషన్లు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయని, ఆయా స్టేషన్‌లలో సిబ్బంది కొరతను ఉందని, త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామన్నారు. సరిహద్దులో ఉన్న పోలీస్‌స్టేషన్ల వాహనాలు కూడా కండీషన్‌లో లేవని గుర్తించామని, వెంటనే వాటికి మరమ్మతులు చేయిస్తామని, అవసరమైన చోట కొత్తవాటిని కేటాయిస్తామన్నారు. నేరాల నియంత్రణకు జిల్లాలోని అన్ని డివిజన్‌లలో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశామన్నారు. కిడ్నాపర్లు, హంతకులను గుర్తించడానికి కూడా ఈ డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ఎస్పీ వెంట పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఉన్నారు.



ఖాద్రీశుని ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

నమో నారసింహా

కదిరి టౌన్: ఖాద్రీశుని ఆలయం శుక్రవారం భక్తులతో పోటెత్తింది. గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి జన్మనక్షత్రమైన స్వాతి కలిసి రావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. 'ఓం నమో నారసింహా... గోవిందా' అంటూ స్వామివారిని కీర్తించగా కదిరి వీధులన్నీ ప్రతిధ్వనించాయి. పలువురు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

సజీవ దహనమైన వృద్ధుడు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: మండలంలోని ఓబులనాయనపల్లి గ్రామానికి చెందిన బొమ్మకగారి పోతులయ్య(72) ప్రమాదవశాత్తు ఒంటికి నిప్పంటుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... వయసు పైబడడంతో పోతులయ్యకు కళ్లు కనిపించవు. మంచానికే పరిమితమైన ఆయనను కుటుంబ సభ్యులు ఇంటి పక్కనే ఉన్న బోద కొట్టంలో ఉంచి సపర్యలు చేస్తున్నారు. గురువారం అర్ధరాత్రి వృద్ధుడు చలి తీవ్రతను తాళలేక బీడీ అంటించి అగ్గి పుల్లను ఆర్పినాననుకుని పక్కనే వేశాడు. కాసేపటికి మంటలు పరుపును తాకి బోద కొట్టానికి వ్యాపించాయి. మంటల్లో వృద్ధుడు సజీవంగా దహనమయ్యాడు. సమాచారం అందుకున్న ధర్మవరం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ముద్దాయికి జీవిత ఖైదు



అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం సెంట్రల్: బాలికపై అత్యాచారం కేసులో ముద్దాయికి జీవిత ఖైదు విధిస్తూ శుక్రవారం అనంతపురం పోక్సో ట్రయల్ కేసుల కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి కీలక తీర్పు ఇచ్చారు. ఈ కేసుకు సంబంధించి పూర్వాపరాల్లోకి వెళ్తే.. 2020 జూలై 3న మండల కేంద్రం పుట్లూరులో ఆరేళ్ల బాలికను ఇంటివద్ద వదిలి తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటిముందు ఆడుకుంటున్న బాలికకు చాక్లెట్ ఇస్తానంటూ తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడు ఆశ చూపి తన ఇంట్లోకి పిలుచుకెళ్లి అత్యాచారం చేశాడు. బాధితురాలి అమ్మమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ వెంకటప్రసాద్ కేసు నమోదు చేశారు. అప్పటి తాడిపత్రి డీఎస్పీలు ఎ.శ్రీనివాసులు, బి.వెంకటశివారెడ్డి కేసు దర్యాప్తు చేశారు. అనంతపురం పోక్సో ట్రయల్ కేసుల కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో 13 మంది సాక్షులను విచారించిన జడ్జి రాజ్యలక్ష్మి.. నేరం రుజువు కావడంతో ముద్దాయి తలారి రామాంజనేయులు అలియాస్ మూగోడుకు జీవితఖైదుతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ. 10.50 లక్షలు (గతంలో రూ. 50 వేలు ఇచ్చారు) పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ కె.ఈశ్వరమ్మ వాదించారు.

67 మంది పీసీలు, 37 మంది హెచ్‌సీల బదిలీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో 67మంది కానిస్టేబుళ్లు, 37 మంది హెడ్‌కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ శుక్రవారం రాత్రి ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఈ ప్రక్రియ పూర్తి చేసినట్లు డీపీఓ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. బదిలీ అయిన వారు రెండు రోజుల్లో కొత్త పీఎస్‌లో రిపోర్టు చేసుకోవాల్సి ఉంది.

ప్రమోషన్ తీసుకో...

ఉత్తర్వులు అడగొద్దు!

- ఇదీ కార్పొరేషన్, మునిసిపల్ స్కూళ్ల టీచర్ల పదోన్నతుల తీరు
- హెచ్‌ఎం పోస్టులకు పది రోజుల క్రితం ప్రమోషన్
- ఇప్పటి దాకా చేతికివ్వని ఉత్తర్వులు
- మునిసిపల్ ఆర్డీ వద్ద ఫైలు
- నాన్చుడు ధోరణిలోనే ఎస్జీటీల పదోన్నతులు



హెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందిన టీచర్లతో డీఈఓ ప్రసాద్‌బాబు (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: 'మీకు కావాల్సింది పదోన్నతులే కదా? అయితే తీసుకోండి! ఉత్తర్వులు మాత్రం అడగొద్దు' అనే రీతిలో ఉంది విద్యాశాఖ అధికారుల తీరు. కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్లల్లో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు ఇటీవల పదోన్నతులు కల్పించారు.పది రోజుల క్రితం ఇచ్చిన పదోన్నతులకు సంబంధించి ఇప్పటి వరకూ వారి చేతికి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఈ పదోన్నతులపై త్రీమెన్ కమిటీ సభ్యులు డీఈఓ, మునిసిపల్ ఆర్డీ, ప్రాథమిక విద్య ఆర్జేడీ సంతకాలు చేయాల్సి ఉంది. కౌన్సెలింగ్ ముగిసిన రెండు రోజులకే విద్యాశాఖ నుంచి మున్సిపల్ ఆర్డీకి వెళ్లిన ఫైలు తిరిగి రాలేదు. రోస్టర్ పాయింట్ల సమస్య కారణంగా పెండింగ్ పెట్టినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా పొరుగు జిల్లాల్లో ఈ ప్రక్రియ పూర్తయింది.

ప్రభుత్వ ప్రకటన ఆర్భాటమే

కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్లలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు పదోన్నతులు చేపట్టాలని కూటమి ప్రభుత్వ ప్రకటన అర్భాటంగానే మారింది. ఆచరణలో ఈ ప్రక్రియ మొత్తం నీరుగారిపోయింది. మున్సిపల్ స్కూళ్లు విద్యాశాఖ పరిధిలోకి వచ్చిన తర్వాత తొలిసారి పదోన్నతులు చేపట్టారు. అనంతపురం కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీలు మరో యూనిట్‌గా పదోన్నతులను అధికారులు చేపట్టారు. ఈ నెల 6న హెచ్‌ఎం పదోన్నతులు, 8న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు కల్పిస్తున్నట్లు షెడ్యూలు కూడా విడుదల చేశారు. మున్సిపల్ స్కూళ్ల టీచర్ల వివరాలేవీ వీరి వద్ద లేకపోవడం, మున్సిపల్ ఆర్డీ నుంచి సరైన స్పందన లేకపోవడంతో పదోన్నతుల ప్రక్రియ కాస్త ఆలస్యమవుతూ వచ్చింది. సీనియార్టీ జాబితాలు తయారు చేసేందుకు విద్యాశాఖ సిబ్బంది తలలు పట్టుకోవాల్సి వచ్చింది. పలుమార్లు మున్సిపల్ ఆర్డీ కార్యాలయం చుట్టూ తిరిగి చివరకు సీనియార్టీ జాబితా సిద్ధం చేశారు. ఆ తర్వాత ఈ నెల 20న హెచ్‌ఎం పోస్టులకు పదోన్నతులు కల్పించారు. కార్పొరేషన్ పరిధిలో ముగ్గురు, మున్సిపల్ స్కూళ్లలో ముగ్గురు చొప్పున పదోన్నతి పొందారు. కానీ... ఉత్తర్వులు నేటికీ అందలేదు.

వీడని నాన్చుడు ధోరణి

అర్హులైన ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ గందరగోళంగా మారింది. దీనిపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. రోస్టర్ సమస్య తలెత్తడంతో ఇటీవల రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి ఉద్యోగులు సవరించారు. రాష్ట్ర అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు చేపడతామని అంటున్నారు.

నేను సంతకం చేశా



కార్పొరేషన్, మున్సిపల్ స్కూళ్ల హెచ్‌ఎం పోస్టుల పదోన్నతుల ఫైలుపై నా సంతకం పూర్తయింది. మున్సిపల్ ఆర్డీ సంతకం చేసి పంపాల్సి ఉంది. రాగానే ఆర్జేడీకి పంపి ఒక్క రోజులోనే ఉత్తర్వులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. ఎస్జీటీలకు సంబంధించి నెలకొన్న రోస్టర్ సమస్యను పరిష్కరించాం. రాష్ట్ర అధికారుల నుంచి అనుమతులు రాగానే ఆ పోస్టులకూ పదోన్నతులు కల్పిస్తాం.

– ఎం.ప్రసాద్‌బాబు డీఈఓ

భార్య హత్య కేసులో భర్త అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: వివాహితను హతమార్చి అజ్ఞాతంలోకి వెళ్లిన భర్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ జనార్దన్, ఎస్‌ఐ నరేంద్ర వెల్లడించారు. లేపాక్షి మండలం కొండూరు గ్రామానికి చెందిన ఈశ్వరమ్మను రెండు రోజుల క్రితం భర్త రాజశేఖర్‌ను హతమార్చిన విషయం తెలిసిందే. హతురాలి తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో శుక్రవారం ఉదయం లేపాక్షి శివారులో నిందితుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన కత్తి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇతరులతో ఈశ్వరమ్మ వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నట్లుగా అనుమానం వచ్చిందని, ఈ అంశంపై నిలదీస్తే గొడవ చోటు చేసుకుని కత్తితో గొంతుపై పొడిచి హతమార్చినట్లు పోలీసుల విచారణలో నిందితుడు అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

'వీర'బాదుడు



సెంచరీ సాధించిన వీరారెడ్డి

అనంతపురం సెంట్రల్: బీసీసీఐ ఆధ్వర్యంలో మంగళగిరి వేదికగా శుక్రవారం జరిగిన అండర్ 19 కూచ్ బెహార్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో జిల్లాకు చెందిన కేహెచ్ వీరారెడ్డి చెలరేగాడు. ఆంధ్ర, ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన తొలి ఇన్నింగ్స్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు 10 వికెట్లు కోల్పోయి 139 పరుగులు సాధించింది. అనంతరం బరిలో దిగిన ఉత్తరాఖండ్ జట్టు 10 వికెట్లు కోల్పోయి 85 పరుగులకు పరిమితమైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు 10 వికెట్లు కోల్పోయి 337 పరుగులు సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టాండ్‌బైగా దిగిన జిల్లాకు చెందిన వీరారెడ్డి వీరవిహారం సాగించాడు. మైదానం నలుమూలాల బంతిని బౌండరీలు దాటిస్తూ 104 బంతుల్లో 106 పరుగులు సాధించాడు. టోర్నీలో రాణించిన వీరారెడ్డిని ఏడీసీఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందించారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



మంజునాథ్ (ఫైల్)

కంబదూరు: అప్పులు తీర్చే మార్గం కానరాక కంబదూరు మండలం కురాకులపల్లికి చెందిన రైతు గొల్ల మంజునాథ్(40) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకున్న ఐదు ఎకరాల పొలంలో టమాట, వేరుశనగ, మిరప తదితర పంటలను రైతు మంజునాథ్ సాగు చేసేవాడు. ఈ క్రమంలో పొలం పనుల కోసమని ఓ ట్రాక్టర్‌నూ కొనుగోలు చేశాడు. అయితే పంట నష్టపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద చేసిన అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.12 లక్షలకు చేరింది. దీనికి తోడు ట్రాక్టర్ కంతులు చెల్లించాలంటూ ఫైనాన్స్ కంపెనీ నుంచి తీవ్ర ఒత్తిళ్లు మొదలయ్యాయి. దీంతో తీవ్ర మనో వేదనకు లోనైన ఆయన శుక్రవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటి బయటకు వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య శారదతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకుందాం

- ఏపీఎస్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు



అధ్యక్షుడిగా ఎంపికైన మారుతీప్రసాద్



జయకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి



నరేష్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

పెనుకొండ: ప్రభుత్వ విద్యారంగాన్ని రక్షించుకుందామంటూ ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్‌టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అసోసియేషన్ జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశం పెనుకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంపీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కాడిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణలో భాగంగా బడి బాధ్యత.. మన భవిష్యత్తు నినాదంతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. యాప్‌లు, గూగుల్‌షీట్లు, అపార్ వంటి పనులతో ఉపాధ్యాయుల విలువైన బోధన సమయాన్ని హరించి వేయడం తగదన్నారు. ప్రాథమిక పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకం చేసిన జీఓ 117 రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేసారు. పీఆర్సీ ఆలస్యమవుతున్నందున మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పుల్లయ్య, కిష్టప్ప, మారుతీప్రసాద్, జయకృష్ణ, నరేష్‌కుమార్, ప్రదీప్‌కుమార్, శంకర్, విశ్వమోహన్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక..

జిల్లా నూతన కార్యవర్గాన్ని కాడిశెట్టి శ్రీనివాసులు శుక్రవారం ఎంపిక చేసారు. గౌరవాధ్యక్షుడిగా బి.కృష్ణానాయక్, అధ్యక్షుడిగా మారుతీప్రసాద్ (మడకశిర), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నగేష్‌కుమార్ (పెనుకొండ), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా మక్కిశెట్టి కుమార్ (కొత్తచెరువు), ప్రధాన కార్యదర్శిగా పూజారి జయకృష్ణ (పరిగి), సంయుక్త కార్యదర్శిగా విశ్వమోహన్‌రెడ్డి (ఎన్.పి.కుంట), కోశాధికారిగా ప్రదీప్‌కుమార్ (అమరాపురం), ఉపాధ్యక్షులుగా విశ్వనాథరెడ్డి (చిలమత్తూరు), శ్రీనివాసులు (నల్లచెరువు), కె.కిష్టప్ప (సోమందేపల్లి), ఎం.శంకర్ (రొద్దం), ఎల్.విజయకుమార్ నాయక్ (పెనుకొండ), మారుతి (గుడిబండ), రామమోహన్ (ధర్మవరం)ను ఎంపిక చేశారు. కార్యదర్శులుగా సౌజన్య (గాండ్లపెంట), శ్రీనివాసులు (ఓడీసీ), ఆడిట్ కన్వీనర్‌గా కరిబసప్ప (అమరాపురం)ను నియమించారు.

క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి, తదితరులు

బుక్కరాయసముద్రం: గ్లోబల్ ఐటీ కంపెనీ టీసీఎస్ ఇటీవల నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌లో ఎస్‌ఆర్‌ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. బీకేఎస్ మండలం రోటరీపురం వద్ద ఉన్న ఆ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి వెల్లడించారు. టాటా కన్సల్టెన్సీ సర్వీస్ (టీసీఎస్) ఇటీవల నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన 138 మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. వీరిలో ఇద్దరికి ప్రైమ్ ఆఫర్‌తో ఏడాదికి రూ.9 లక్షల ప్యాకేజీ దక్కిందన్నారు. 21 మందికి ఏడాదికి రూ.7లక్షలు, 115 మంది రూ.3 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. తమ కళాశాలలోని అన్ని బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికవ్వడం చాలా గర్వంగా ఉందన్నారు. వీరిలో చాలా మంది ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదువుకున్న వారే ఉన్నారన్నారు. తమ కళాశాలలో ప్రతి విద్యార్థికీ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో యాజమాన్యం పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైలు నంబర్లలో మార్పు

రాయదుర్గం టౌన్: రాయదుర్గం మీదుగా రాకపోకలకు సాగించే పలు రైళ్ల సర్వీస్ నంబర్లు 2025, జనవరి 1వ తేదీ నుంచి మారనున్నాయి. ఈ మేరకు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ అసిస్టెంట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ శివకుమార్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తిరుపతి–కదిరిదేవరపల్లి రైలు (07589), కదిరిదేవరపల్లి–తిరుపతి (07590) ఇకపై 57405, 57406గా మారనున్నాయి. అలాగే గుంతకల్లు – చిక్కజాజూరు రైలు (07586), చిక్కజాజూరు–గుంతకల్లు రైలు (07585) ఇకపై 57415, 57416గా చలామణి కానున్నాయి. ఈ మార్పును ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు. కాగా, రాయదుర్గం మీదుగా నడిచే కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు పాక్షిక రద్దు గడువును రేపటి నుంచి 31వ తేదీ వరకూ పొడిగించారు. ఈ మేరకు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్ మేనేజర్ అరవింద్ హర్లే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో ఈ రైలు గుంతకల్లు–తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగించనుంది.

గ్రామాల్లో పశువుల అపహరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న చిన్నపల్లి, హరియాన్‌చెరువు గ్రామాల్లో గురువారం రాత్రి పశువులను దుండగులు అపహరించుకెళ్లారు. స్థానికులు తెలిపిన మేరకు... చిన్నపల్లి గ్రామానికి చెందిన రైతు మాధవరాజులు గురువారం రాత్రి తన రెండు కోడెలను పశువుల పాకలో కట్టేసి ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత వాటిని దుండగులు వాహనంలో ఎక్కించుకెళ్లారు. వీటి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుంది. అలాగే హరియాన్‌చెరువు గ్రామానికి చెందిన రైతు బిల్లే లక్ష్మీనారాయణ పాడి ఆవునూ అపహరించారు. అదే గ్రామంలో మరో రైతుకు చెందిన ఆవులను తరలించే ప్రయత్నం చేస్తుండగా ఆ సమయంలో కియా కంపెనీలో పనిచేస్తున్న యువకులు అటుగా రావడంతో వాటిని వదలి దుండగులు పారిపోయారు. అపహరించిన పాడి ఆవు విలువ దాదాపు రూ.70 వేల వరకు ఉంటుంది. విషయం తెలుసుకున్న పోలీసులు శుక్రవారం ఉదయం ఆయా గ్రామాలకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు.

అప్పా ప్రిన్సిపాల్‌గా రఘువీరారెడ్డి బాధ్యతల స్వీకరణ

- నేడు ఉద్యోగ విరమణ



అనంతపురం సెంట్రల్: ఏపీ పోలీసు ట్రైనింగ్ కళాశాల (అప్పా) ప్రిన్సిపాల్‌గా కె.రఘువీరారెడ్డి (ఐపీఎస్) నియమితులయ్యారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనను బదిలీపై అప్పా ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌ఐగా పోలీసుశాఖలో చేరిన ఆయన పట్టుదలతో ఐపీఎస్ సాధించి ఉభయ గోదావరి జిల్లాల ఎస్పీగాను, సీఐడీ ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల సమయంలో నంద్యాల జిల్లా ఎస్పీగా ఉన్నారు. అనంతరం వెయిటింగ్‌లో ఉంటూ వచ్చిన ఆయనకు సర్వీసు ఆఖరు రోజున పోస్టింగ్ ఇవ్వడంతో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు.


శ్రీహరికోట స్పేస్ సెంటర్‌కు 3న ప్రత్యేక బస్సులు

రాయదుర్గం టౌన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో డిసెంబర్ 4న సాయంత్రం 4.08 తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్‌ఎల్‌వీ సి.59 రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగాన్ని ప్రత్యక్షంగా చూసేందుకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు రాయదుర్గం డిపో మేనేజ్ జె. శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3న రాత్రి 9 గంటలకు రాయదుర్గం నుంచి బస్సు బయలుదేరుతుంది. షార్‌తో పాటు పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల విహారకేంద్రం, సూళ్లూరుపేట చెంగాలమ్మ గుడిని చూసొచ్చే అవకాశాన్ని కల్పించారు. సూపర్ సర్వీసుకు ఒక్కొక్కరికి రూ.1,300, సూపర్ లగ్జరీ సర్వీసుకు రూ.1,800 చొప్పున రానూపోను చార్జీ నిర్ణయించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు వారి కళాశాల రిజిస్ట్రేషన్ నంబర్లు, విద్యార్థుల వివరాలు, ఆధార్ కార్డు జిరాక్సులను డిపో మేనేజర్‌కు అందజేయాలి. మరింత సమాచారం, టికెట్ బుకింగ్ కోసం 99592 25863, 73828 63229లో సంప్రదించవచ్చు.

దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు

అనంతపురం కల్చరల్: దివ్యాంగులకు భారత వికాస పరిషత్తు ఆధ్వర్యంలో ఉచితంగా కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ అందించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు, దీర్ఘరోగాలతో దివ్యాంగులైన వారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన వారు డిసెంబర్ 14వ తేదీ లోపు 'పరుచూరు రమేష్‌బాబు, శ్రీనివాస క్లాత్‌స్టోర్, రఘువీర టవర్స్ పక్కన, సుభాష్‌రోడ్డు, అనంతపురం' చిరునామాలో దరఖాస్తులందించాలి. పూర్తి సమాచారానికి 98495 08904లో సంప్రదించవచ్చు.

ఎఫ్‌ఎస్‌ఓగా రామకృష్ణారెడ్డి



జి.రామకృష్ణారెడ్డి

అనంతపురం అర్బన్: జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ జి.రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌డీసీగా కె.మల్లికార్జునుడు, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీగా డి.తిప్పేనాయక్, ప్రభుత్వ సర్వజనాస్పత్రి అడ్మినిస్ట్రేటర్‌గా వి.మల్లికార్జునరెడ్డి, హెచ్‌ఎల్‌సీ డిప్యూటీ కలెక్టర్‌గా జి.బి.సుబ్బారెడ్డి నియమితులయ్యారు. కాగా, జి.రామకృష్ణారెడ్డి ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు జిల్లా రెవెన్యూ అధికారిగా పనిచేసిన విషయం తెలిసిందే.

● దానిమ్మకు తెగులు.. రైతుకు దిగాలు



బుక్కరాయసముద్రం మండలం జంతులూరు వద్ద రైతు మురళి సాగు చేసిన దానిమ్మ పంట



తెగుళ్లబారిన పడిన కాయలను చూస్తున్న రైతు మురళి

ఉద్యాన తోటల్లో ప్రధాన వాణిజ్య పంటగా గుర్తింపు పొందిన దానిమ్మ తెగుళ్ల బారిన పడింది. ఓ వైపు మార్కెట్‌లో గిట్టుబాటు ధర పోవడంతో రైతులే స్వయంగా ద్విచక్ర వాహనాలపై దిగుబడిని నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మరో వైపు బ్యాక్టీరియా మచ్చ తెగులు ప్రభావంతో కాయలో నాణ్యత తగ్గి కిలో రూ.50కు మించి ధర దక్కడం లేదు. ఫలితంగా రైతులు నష్టపోతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



నగరంలో విక్రయించేందుకు దానిమ్మను తీసుకువచ్చిన రైతు